క్లుప్తంగా

మిగులు సీట్ల భర్తీకి రాతపరీక్ష



గొలుగొండలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గొలుగొండ: స్థానిక బాలయోగి గురుకుల కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి గురువారం విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. 6, 7, 8, 9 తరగతుల్లో 70 సీట్లుకు గాను 154 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రాత పరీక్షకు 134 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. రాత పరీక్షను ఎంఈవో సత్యనారాయణ పర్యవేక్షించారు.

గ్రామాల్లో ముమ్మరంగా వైద్య సేవలు



సుద్దలపాలెంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: మండలంలో సుద్దలపాలెం, చీడిగుమ్మల, ఎర్రవరం గ్రామాల్లో గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్‌ల ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ఇంటి వద్ద నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

మాడుగుల: అభిరుచి అకాడమీ ఆధ్వర్యంలో సేవాభారతి ట్రస్టు సౌజన్యంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన సేవాభారతి కార్యాలయంలో డీఎస్సీ కోచింగ్ నిర్వహించనున్నా రు. 2008 డీఎస్సీలో ఎనిమిది మంది అభ్యర్థు లు ఉద్యోగం సాధించారని అకాడమీ సభ్యుడు వర్మ తెలిపారు. తాజాగా సేవా దృక్పథంతో కోచింగ్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ అందిస్తామన్నా రు. మరిన్ని వివరాలకు 9346468792 సంప్రదించాలన్నారు.

మోటారు బోరు పనులు ప్రారంభం

గొలుగొండ: సిహెచ్. నాగాపురంలో రూ. 5 లక్షలతో మోటారు బోరు పనులు ప్రారంభించారు. ఇక్కడ తాగునీటి ఇబ్బందులు లేకుండా జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామంలో ప్రజలందరికి తాగునీటి సమస్యలు ఉండవన్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురాం, నాయకులు గంటల బుచ్చిబాబుతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్‌రాజు చెప్పారు. ఫ్యాక్టరీ పరిస్థితిపై రైతులతో కలిసి ఆయన ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడుతో శుక్రవారం సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ అభివృద్ధి అంశాన్ని ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామన్నారు. జనసేన మండల అధ్యక్షుడు గూనూరు మూలునాయుడు, పట్టణ అధ్యక్షుడు కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పీవీ



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం: ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు అని హెచ్ఎం కె.రాము అన్నారు. శుక్రవారం తూటిపాల పాఠశాలలో పి.వి జయంతి సందర్భంగా మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ పీవీ గొప్ప దార్శనికుడు, బహుభాషా కోవిదుడని కొనియాడారు. దేశ భద్రతను కాపాడటం, ఆర్థిక మాంద్యం రాకుండా చర్యలు తీసుకోవడం వంటి పీవీ ఆలోచనలు ఎంతో ఉన్నతమైనవన్నారు.

వేరుశనగలో విత్తన శుద్ధి

- పంటకు ఆశించే తెగుళ్ల నివారణ
- ప్రస్తుతం 45 ఎకరాల్లో సాగు
- మరో 55 ఎకరాల్లో విత్తేందుకు సిద్ధం



వారాడలో వేరుశనగ పంట



ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: వాతావరణంలో మార్పులతో నైరుతి పవనాలు పలకరించాయి. దాంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు మేలు చేస్తున్నాయి. ప్రస్తుతం 45 ఎకరాల్లో వేసిన వేరుశనగ పంట మొక్క దశలో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పంట ఆశాజనకంగా ఉంది. తాజాగా వారాడ, ఆర్.వై.అగ్రహారం, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, పోతనవలస, ఆనందపురం, కొరువాడ, ఉగ్గినవలస తదితర గ్రామాల్లో మరో 55 ఎకరాల్లో వేరుశనగ విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగు సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ సూచించారు.

- ఖరీఫ్ వేరుశనగ సాగు రైతులు పొలంలో దుక్కులు చేసే సమయంలో ఎకరానికి 10 నుంచి 20 కిలోల యూరియా వేయాలి. దీంతోపాటు 100 కిలోల సూపర్‌ఫాస్పేట్ మిశ్రమాన్ని వేసి కలియ దున్నాలి.
- ఎకరానికి 60 కిలోల వేరుశనగ విత్తనాలను నాటేందుకు ఉపయోగించాలి.
- వేరుశనగ విత్తనానికి తప్పకుండా విత్తన శుద్ధి చేయాలి. కిలో వేరుశనగ విత్తనాలకు రెండు గ్రాముల మ్యాంకోజబ్ అనే మిశ్రమాన్ని విత్తనానికి పట్టించాలి. తద్వారా విత్తన శుద్ధి చేయడం వల్ల భూమి ద్వారా పంటకు ఆశించే తెగుళ్లు నివారించవచ్చు.
- వేరుశనగ విత్తే సమయంలో రెండు వరుసల మొక్కల మధ్య ఖాళీ 15 నుంచి 20 సెంటీమీటర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విధంగా మొక్కల మధ్య ఖాళీ ఉండటం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి మంచి దిగుబడి రానున్నది.
- వేరుశనగ విత్తడం పూర్తి చేసిన పంటకు ప్రతీ పది రోజులకు నీటి తడులను అందిస్తే మంచిది.
- వేరుశనగ పంటకు కంచె పంటగా ఆముదం మొక్కలను నాటాలి. వేరుశనగ పంటకు పొగాకు లద్దెపురుగు ఆశించే అవకాశాలున్నాయి. ఈ కారణంగా కంచె పంటగా వేసే ఆముదం మొక్కల ఆకులను పొగాకు లద్దెపురుగు ఆశిస్తుంది. తద్వారా వేరుశనగ పంటకు నష్టం కలగకుండా కంచె పంట అయిన ఆముదం మొక్కలు మేలు చేయనున్నాయి.
- వేరుశనగ పంట పూతదశ సమయంలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయడం వల్ల పంటలో నూనెశాతం పెరుగుతుంది.

14 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే నేరం



బట్టల దుకాణంలో తనిఖీ చేస్తున్న సూర్యనారాయణ

కె.కోటపాడు షాపుల్లో చోడవరం లేబర్ అధికారి తనిఖీ

కె.కోటపాడు: 14 ఏళ్లలోపు వారిని వ్యాపార సముదాయాల్లో పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని చోడవరం లేబర్ అధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కె.కోటపాడులోని పలు వ్యాపార సముదాయాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. నిర్దేశిత వయస్సు లోపు వారిని పనుల్లో పెట్టుకుంటే చట్టాన్ని ఉల్లఘించిన వారవడంతోపాటు కేసులు నమోదు చేయిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనాలతోపాటు వారాంతపు సెలవులు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు, ఏఎస్ఐ రాముడు తదితరులు పాల్గొన్నారు.

బడిలోనే బడిఈడు పిల్లలు

విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ



మాకవరపాలెంలో ర్యాలీ చేస్తున్న ఎంఈవో, సిబ్బంది

మాకవరపాలెం: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో మూర్తి కోరారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు పూర్తయిన పిల్లలను బడుల్లో చేర్పాలన్నారు. చిన్నపిల్లలను పనుల్లో పెట్టడం నేరమని, అలా చేస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీ గ్రామంలో విద్యార్థుల ప్రదర్శన

గాంధీ గ్రామంలో నేను బడికి పోతా

చోడవరం రూరల్: గాంధీ గ్రామంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలని కోరుతూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదని, బడిలో ఉండాలని ప్లకార్డులతోపాటు నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు కండేల వెంకటరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని అమ్మాజీ, గ్రామ సచివాలయ సంక్షేమ కార్యదర్శి శంకర్ ర్యాలీ చేశారు. మండల విద్యాశాఖాధికారి జయలక్ష్మి హాజరై తల్లిదండ్రుల నుద్దేశించి మాట్లాడారు. బడికి పంపే పిల్లల సంక్షేమం ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. సీఆర్ఎంటి కె.వి.మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుతో సంపూర్ణ ఆరోగ్యం



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలగనున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. శుక్రవారం శంగవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. 127 మందిని పరీక్షించడంతోపాటు ఉచితంగా మందులు ఇచ్చారు. ఆరుగురు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాల పరిసరాల్లో మురుగు ఉండకుండా చూసుకోవాలని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం స్వాతి, హెచ్ఏ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోవ గవరవరంలో

మాడుగుల రూరల్: కింతలి పీహెచ్‌సీ జె.డి.పేట సచివాలయం పరిధిలోని లోవ గవరవరంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కేఎంనాయుడు ఆధ్వర్యంలో 78 మంది రోగులను పరీక్షించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జె.డి.పేట ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



సూచనలు చేస్తున్న తహసీల్దారు రమేష్‌కుమార్

నాతవరం: గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణ కాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలదేనని తహసీల్దారు ఎస్. రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై సూచనలు చేశారు. రైతుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. మ్యూటేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందిస్తేనే రెవెన్యూ శాఖకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కొంతమంది వీఆర్వోలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వారిలో మార్పు రాకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. రెండో విడత వ్యవసాయ గణన సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండలంలో ఎనిమిది రెవెన్యూ గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

మాడుగుల రూరల్: జంపెన కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత భక్తులు శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం పూజలు చేస్తుంటారు. సత్యవరం గ్రామానికి చెందిన గోపిశెట్టి ఈశ్వరరావు కుటుంబ సభ్యులైన వెంకటేష్, మాధురి దంపతులు కుమార్తె మహీ(మహలక్ష్మి) జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కింతలి గాదిరాయి వాసవీక్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దేరు నీటిమట్టం 136.40 మీటర్లు

మాడుగుల రూరల్: రావిపాలెం వద్ద గల పెద్దేరు జలాశయం నీటిమట్టం శుక్రవారం 136.40 మీటర్లు ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు. జలాశయం పరిసర ప్రాంతంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షాలకు 250 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్పిల్‌వే గేట్ల ద్వారా 188 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



కల్యాణం జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: జానకీరాంపురంలో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో రామాలయ నిర్మించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా రామాలయం వద్ద సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితుల సమక్షంలో కల్యాణోత్సవం నిర్వహించగా, గ్రామస్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా వరి నారుమడుల తయారీ



సాగరంలో వరిపోత పొలం

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ముమ్మరంగా వరినారు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు ద్వారా వరి విత్తనాలు కొనుగోలు చేశారు. వరి విత్తనాలు జల్లే పనిలో ఉన్నారు. ఇప్పటికే నారుమడులలో వరి విత్తనాలు పోశారు. కొన్ని చోట్ల వర్షాలు పడతాయని వరినారు వెయ్యలేదు.

వ్యవసాయ గణనపై శిక్షణ



గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇస్తున్న తహసీల్దారు ఈశ్వరమ్మ

కె.కోటపాడు: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలతోపాటు భూమి విస్తీర్ణాన్ని వ్యవసాయ గణనలో నమోదు చేయాలని తహసీల్దారు జె.ఈశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయ గణనపై గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు పంట నమోదు వివరాలను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దారు డి.రమేష్, సహాయ గణాంకాధికారి రమాదేవి, ఆర్ఐ జానకి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అర్లలో తాగునీటి కుళాయి వద్ద బ్లీచింగు చల్లిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరాజు

రోలుగుంట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. ఆయన పర్యవేక్షణలో శుక్రవారం అర్ల, లోసింగి గిరిజన గ్రామాల్లో హెల్త్ అసిస్టెంటు ఆర్. హరిబాబు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలసి పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకున్నారు. గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చేశారు. ప్రధానంగా మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా వీధుల్లో పడేసిన టైర్లు, కొబ్బరి బొండాలను స్థానికులతో ఏరివేయించారు. తాగునీటి బోర్ల వద్ద శుభ్రం చేయించి, బ్లీచింగు చల్లించారు. కుండీల్లో నీటిని రెండు రోజులకొకసారి శుభ్రం చేసి ఆరబెట్టాలని వైద్యాధికారి సూచించారు. కాచిన నీటిని తాగుతూ, వేడి ఆహారం తీసుకోవాలని, అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

పాల సొసైటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం



గెలుపొందిన డైరెక్టర్లతో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

బోయిలకింతాడలో ఏకగ్రీవానికి టీడీపీ విఫలయత్నం



అధ్యక్షుడు వెంకటరమణ

దేవరాపల్లి: బోయిలకింతాడలో శుక్రవారం హోరాహోరీగా జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ ఢంకా మోగించారు. స్థానిక పాల సొసైటీలో రెండు డైరెక్టర్ల స్థానాలకు ఖాళీ ఏర్పడటంతో విశాఖ డెయిరీ అధికారులు ఎన్నిక నిర్వహించారు. ఈ స్థానాలకు పోటీ లేకుండా సొంతం చేసుకునేందుకు టీడీపీ వర్గీయులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య జరిగిన ఎన్నికల్లో రెండు డైరెక్టర్ల పదవులను ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికలో టీడీపీ మద్దతుదారు బుగత ధనలక్ష్మిపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారు అన్నం సాంబమూర్తి 10 ఓట్ల మెజార్టీతోను, విడుదల సత్యారావుపై వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు 12 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్థానిక పాల సొసైటీలోని పది మంది పాలకవర్గ సభ్యులంతా కలిసి నూతన అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు దాసరి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడితోపాటు పాలకవర్గ సభ్యులను చోడవరం చక్కెర కర్మాగార చెరకు అభివృద్ధి మండలి సంస్థ డైరెక్టర్ అన్నం రాము, మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రాము నాయుడు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, సొసైటీ సభ్య రైతులు అభినందించి ఘనంగా సత్కరించారు.

ఒకటి నుంచి ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

చీడికాడ: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి సచివాలయాల సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో వారితో ఆమె సమీక్షించారు. ప్రతి పింఛన్‌దారు ఇంటి వద్దే ఉండేటట్లు ముందుగా వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, వెలుగు ఏపీఎం సిహెచ్.శ్రీనివాస్, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

నాతవరం: మండల వ్యాప్తంగా వచ్చే నెల ఒకటిన 11,230 మందికి వివిధ రకాల పింఛన్ల సొమ్ము పంపిణీ చేయాలని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా పెంచిన పింఛన్ల సొమ్ము రూ.7.50 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సచివాలయాల సిబ్బంది తక్కువగా ఉన్నందున ఇతర శాఖల అధికారులు సహకారంతో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో గ్రామాల్లో అతిసార వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సంయుక్తంగా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎన్వీఎస్ మూర్తి, సీనియర్ అసిస్టెంటు మండల ప్రసాద్, జూనియర్ అసిస్టెంటు లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



రోలుగుంటలో వరి విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

రోలుగుంట: మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను సచివాలయ వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. ముందుగా కావాల్సిన విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు స్లిప్పులు ఇచ్చారు. వారి నుంచి స్లిప్పులు తీసుకుని ఆర్బీకే సిబ్బంది విత్తనాలను అందజేశారు. సాంబమసూరి, ఆర్జీఎల్, స్వర్ణ, ఇంద్ర, నెల్లూరి సన్నాలు, సోనామసూరి వరి విత్తనాలు పంపిణీ చేశారు.

మాకవరపాలెం: స్థానిక సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ అల్లంపల్లి శిరీష, ఉప సర్పంచ్ లాలం రాము రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీచార్జి టారిఫ్ తగ్గించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గోవింద

రోలుగుంట: జియో, ఎయిర్‌టెల్ యాజమాన్యాలు ఇటీవల పెంచిన రీచార్జి టారిఫ్‌లను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవింద డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సీపీఎం సభ్యులతో కలసి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు రీచార్జి ప్లాన్‌లపై 25 శాతం పెంచి వినియోగదారులపై భారం పెంచడం దుర్మార్గం అన్నారు. తొలుత ఉచితం అని, తర్వాత తక్కువ ధరకే అని ఇప్పుడు ప్రజల వినియోగం పెరగడంతో అధికంగా పెంచడం మంచి విధానం కాదన్నారు. దీనిపై పునరాలోచన చేసి వెంటనే పెంచిన చార్జీలు తగ్గించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.